

సత్తా చాటాలి..
జాతీయస్థాయికి ఎదగాలి..
● ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి
● నవోదయలో ముగిసిన క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ పోటీలు
7 లో

సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో
అదనంగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ

మంత్రి దామోదర్ రాజనర్సింహ

సమస్యలు, వసతుల కల్పనపై మంత్రి దృష్టికి తీసుకెళ్లిన జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అదనంగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం మరో సీటీ స్కాన్‌తో పాటు ఎంఆర్ఐ పరికరం అవసరమని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విన్నవించగా సానుకూలంగా స్పందించిన మంత్రి.. మంజూరు చేస్తామని ప్రకటించారు. ఆస్పత్రిలోని ఓపీ, ఫార్మసీ, ల్యాబ్, డయాలసిస్, టీ-డయాగ్నోస్టిక్‌హబ్‌తో పాటు ఎంసీహెచ్‌లోని నవజాతశిశు



సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంరక్షణ కేంద్రం తదితర వార్డులను పరిశీలించారు. పలువురు రోగులతో ఆప్యాయంగా పలకరించి నాణ్యమైన వైద్య సేవలందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

పనుల్లో జాప్యంపై ఆగ్రహం

మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు జాప్యంపై ఆర్అండ్‌బీ, కాంట్రాక్టర్‌పై మంత్రి దామోదర్, జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో పనుల్లో ఆలస్యంగా జరుగుతున్నదని కాంట్రాక్టర్ బదులిచ్చారు. దీనిపై స్పందిస్తూ.. ఈ విషయం ఎనిమిది నెలలుగా ఎందుకు తమదృష్టికి తీసుకురాలేదని, అప్పుడే వచ్చి ఉంటే సమస్యకు పరిష్కారం దొరికేదని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో అసంపూర్తి భవనాల నిర్మాణ పనులు పూర్తిచేసి మెడికోలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, ఆర్డీవో వసంతకుమారి, డీఎంఈ డా.వాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్, జీఎంసీ ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, డీసీహెచ్ఎస్ డా.సంగారెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ రాంబాబు, అధికారులు, వైద్య సిబ్బంది, మెడికోలు పాల్గొన్నారు.



టోకెన్ నంబర్..

రుణమాఫీ అయిన రైతులు తిరిగి పంట రుణాలు పొందడానికి బ్యాంకుల బాటపడుతున్నారు. నారాయణఖేడ్‌లోని అన్ని బ్యాంకులు రైతులతో పోటెత్తుతున్నాయి. పట్టణంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద రైతుల రద్దీ మరింత ఎక్కువగా ఉన్నది. బ్యాంకు పరిధిలో చిన్నా పెద్దవి కలిపి 100 గ్రామాలు ఉన్నాయి. ఎనిమిది వేల మందికి రుణమాఫీ జరిగింది. రైతులు తిరిగి రుణం పొందడానికి బ్యాంకులకు రావడంతో బ్యాంకు వద్ద తోపులాట చోటుచేసుకుంటున్నది. రుణాల కోసం గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచే వందలాది మంది రైతులు బ్యాంకు ఎదుట బారులుతీరడంతో.. పోలీసుల పహారా మధ్య బ్యాంకు సిబ్బంది టోకెన్‌లు ఇచ్చి, నంబర్లవారీగా పిలిచి రుణాలు ఇచ్చారు.

-నారాయణఖేడ్

ఇటీవలి కాలంలో శునకాల దాడులు మితిమీరడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. కుక్కలను నియంత్రించే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 315 జీవో ద్వారా పలు కీలకమైన సూచనలు చేసింది. పల్లెలు, పట్టణాల్లో యానిమల్ బర్త్ కంట్రోల్ కమిటీలను ఏర్పాటు చేసి.. వీరి ద్వారా కుక్కల సంఖ్యను తేల్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సంఖ్య ఆధారంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో అక్కడక్కడా ఈ సర్వే ప్రారంభమైంది.

లెక్క తేలేనా..



శునకాల లెక్కింపునకు సర్వే ● పల్లెలు, పట్టణాల్లో 'ఏబీసీ' కమిటీలు

వీధికుక్కల కట్టడికి కార్యాచరణ ● తూతూమంత్రంగా ముగిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది!

ఉమ్మడి జిల్లాలో 17 మున్సిపాలిటీలు, 1,615 గ్రామాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేటలో 499, సంగారెడ్డిలో 647, మెదక్‌లో 469 గ్రామాలున్నాయి. అదేవిధంగా సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, సంగారెడ్డి, అందోలు-జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, సదాశివపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం, మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. శునకాలను లెక్క తేల్చడానికి మున్సిపాలిటీ, మండల, గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. దీని ప్రకారం మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ ఆఫీసర్లు, గ్రామపంచాయతీల కార్యదర్శులు, వెటర్నరీ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, జంతు ప్రేమికులు, మహిళా సంఘాల ప్రతినిధులకు కమిటీల్లో భాగస్వామ్యం కల్పించాల్సి ఉంది. వీరంతా ఒక కమిటీగా ఏర్పాటై గ్రామాలు, పట్టణాలవారీగా శునకాల లెక్క తేల్చి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఆడ, మగ జాతుల కుక్కలతోపాటు క్రూరత్వంగా ఉండే కుక్కలను సైతం గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏబీసీ కమిటీలుగా పేర్కొనే ఈ కమిటీలపైనే పూర్తి బాధ్యత ఈ కమిటీలకే ఉంటుంది.



సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రి వద్ద శునకాల గుంపు

మొక్కుబడిగా లెక్కింపు

ఇప్పటికే కొన్నిచోట్ల కుక్కలను లెక్కించే కార్యక్రమం మొదలైంది. అయితే నిబంధనల ప్రకారం ఈ లెక్కింపు సాగడం లేదనే విమర్శలున్నాయి. జిల్లాస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన గంటల్లోనే కొంతమంది కార్యదర్శులు, సిబ్బంది తమ పరిధిలోని శునకాల సంఖ్యను చెప్పడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇలాగైతే సర్వేతో ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీవోలో సూచించిన మార్గదర్శకాల ప్రకారం సర్వే చేయడం వల్లనే ఫలితం ఉంటుందని చెబుతున్నారు. కానీ కొంతమంది అధికారులు బాధ్యతతో కాకుండా భారంగా ఈ సర్వేను భావిస్తున్నారు. ఆడ, మగ, క్రూరమైన.. ఇలా వర్గాలవారీగా కుక్కలను గుర్తించాలంటే అనేక ఇబ్బందులు ఉండడంతో ఇష్టారీతిగా లెక్కలు అప్పగించేందుకు కూడా అవకాశముందనే విమర్శలున్నాయి. శునకాల లెక్కింపును తూతూమంత్రంగా కాకుండా శాస్త్రీయంగా నిర్వహిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరుతుందని ఓ జిల్లాస్థాయి అధికారి పేర్కొన్నారు.



సిద్దిపేటలోని కోమటిచెరువు నెక్లెస్ రోడ్డుపై..

బర్త్ కంట్రోల్ సాధ్యమేనా?

కుక్కల సంఖ్యను నియంత్రించడానికే ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టినట్లుగా తెలుస్తోంది. అయితే ఒక కుక్కకు కుటుంబ నియంత్రణ సర్జరీ చేయాలంటే రూ.1,600 పైచిలుకు ఖర్చు అవుతుందని అంచనా. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కందిలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో సిద్దిపేటలో కూడా సెంటర్‌ను నిర్వహించినా ఆ తర్వాత నిలిపివేశారు. స్వచ్ఛంద సంస్థలకు ఈ సెంటర్ల బాధ్యతలను అప్పగించగా.. వారి సిబ్బందే కుక్కలను బంధించడం నుంచి వాటికి ఆపరేషన్ చేసి పంపించే వరకు పర్యవేక్షిస్తారు. దీనిని నిరంతరంగా కొనసాగిస్తేనే ఫలితం ఉండే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 50వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అంచనా. వీటన్నింటికి బర్త్‌కంట్రోల్ ఆపరేషన్ చేయించడం సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలున్నా.. చిత్తశుద్ధితో పనిచేస్తేనే సాకారం చేయొచ్చనే వాదన ఉంది.

పాఠశాలల శుభ్రతకు
రూ.6.97 కోట్లు

పారిశుధ్య నిర్వహణకు డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 : సర్కారు బడుల్లో పారిశుధ్య నిర్వహణకు నిధుల సమస్య తీరింది. సర్కారు డీఎంఎఫ్‌టీ నిధులను విడుదల చేసింది. గతంలో పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కోసం స్కావెంజర్లు ఉండేవారు. వారిని తొలగిస్తూ ఆ బాధ్యతను స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగించారు. కానీ, ఆ శాఖలు పట్టించుకోలేదు. దీంతో బడుల్లో పారిశుధ్య నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు ఓ సవాల్‌గా మారింది. విధిలేని పరిస్థితుల్లో పలుచోట్ల హెచ్ఎంలు పారిశుధ్య నిర్వహణ కోసం సొంత డబ్బులు ఖర్చు పెట్టిన సందర్భాలున్నాయి. పాఠశాలల్లో స్కావెంజర్‌ను నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇక పారిశుధ్య పనులకు సంబంధించిన సమస్యలు తీరనున్నాయి.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపు

జిల్లాలో 1-30 మంది విద్యార్థులున్న పాఠశాలలు 436 ఉండగా, 31-100 మంది ఉన్న పాఠశాలలు 503, 101-250 మంది ఉన్న పాఠశాలలు 201, 251-500 మంది ఉన్న పాఠశాలలు 62, 501-750 మంది ఉన్న పాఠశాలలు 13, 750కిపైగా విద్యార్థులున్న బడులు 5 ఉన్నాయి. ఈ రకంగా జిల్లాకు పాఠశాలల శుభ్రతకు సుమారు రూ.6.97 కోట్లు విడుదల కానున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలోని పాఠశాలల్లో అపరిశుభ్రత తొలగి ఆహ్లాదకర వాతావరణం నెలకొననుంది.

'అమ్మ' కమిటీలకు బాధ్యతలు

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. పది నెలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు మంజూరు చేయనున్నారు. పారిశుధ్య నిర్వహణ పనుల బాధ్యతను ఇప్పటికే నియమించిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ (ఏఏపీసీ)లు చేపడతాయి. పిల్లల సంఖ్యను బట్టి నెలకు రూ.3 వేల నుంచి రూ.20 వేలు మంజూరు కానున్నాయి. 1-30 మంది విద్యార్థులుంటే రూ.3 వేలు, 31-100 మంది విద్యార్థులుంటే రూ.6 వేలు, 101-250 మందికి రూ.8 వేలు, 251-500 మంది ఉంటే రూ.12 వేలు, 501-750 మంది ఉంటే రూ.15 వేలు, 750కి పైగా విద్యార్థులుంటే రూ.20 వేలు మంజూరు కానున్నాయి. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్(డీఎంఎఫ్‌టీ)నుంచి ఈ నిధులు విడుదల చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఖాతాల్లో జమ చేస్తారు. సమగ్ర శిక్ష కింద అందిస్తున్న కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా నిధులిస్తారు. పాఠశాలల్లో శుభ్రతకు సంబంధించిన మెటీరియల్ ఖర్చును దీని నుంచే వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, జడ్పీ, మోడల్ స్కూళ్లలో మరుగుదొడ్లు, ఆవరణ శుభ్రత, మొక్కలకు నీరు పోయడానికి ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

'సీఎస్ఆర్' పనులు వేగవంతం చేయండి

అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 8 . సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో ఉన్న కంపెనీలు సీఎస్ఆర్ నిధులు రూ. 160 కోట్లు కేటాయించాల్సి ఉందని తెలిపారు. క్లస్టర్ అధికారులు తమ పరిధిలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నిధులను విడుదల చేయించాలని సూచించారు. సీఎస్ఆర్ నిధులు విద్యా, వైద్యం కోసమే ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు.

ఐదు క్లస్టర్లలోనూ జాప్యమే..

సంగారెడ్డి జిల్లాలో ఐదు క్లస్టర్లలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఎస్ఆర్ నిధులకు సంబంధించిన పనులు ఇప్పటివరకు పూర్తికాలేదని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్య ధోరణిని వీడాలని అన్నారు. మత్తుపదార్థాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఐదు క్లస్టర్ల అధికారులు పరిశ్రమలశాఖ జీఎం, పీసీబీ, ఈడీ-మైన్స్, వైద్య, విద్యాశాఖాధికారులు సమన్వయంతో ఫార్మా పరిశ్రమల్లో తయారయ్యే డ్రగ్స్ వివరాలు సేకరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఇండోర్ స్టేడియం, రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయండి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 : సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో రన్నింగ్ ట్రాక్‌తో పాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతూ మంజీర స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాణయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ స్టేడియంలో అన్ని క్రీడాంశాలకు కోచ్‌లు నియమించాలని, జిల్లాకేంద్రంలో ప్రాంతీయ క్రీడా అకాడమీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మంజీర స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి విఠల్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మంజీర స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు



ధర్నా చేస్తున్న రైతులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

పరిహారంపై తేల్చేదాకా సర్వే జరగనివ్వం

అడ్డుకున్న రైతులు.. అరెస్టు చేసిన పోలీసులు

కొండాపూర్, ఆగస్టు 8 : ఉంటున్న ఇళ్లనైనా విడిచి వెళ్తాం కానీ.. భూములను వదులుకోమని రైతులు ధర్నాకు దిగ్గారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ శివారులో ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం సర్వే చేసేందుకు గురువారం అధికారులు చేరుకోగా రైతులు అడ్డుకున్నారు. ట్రిపుల్‌ఆర్ సర్వే కోసం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పోలీసులతో కలిసి వచ్చారు. వారిని అడ్డుకున్న రైతులు నష్ట పరిహారంపై స్పష్టత వచ్చేవరకు సర్వే చేయొద్దని డిమాండ్ చేశారు. పట్టా భూములో నుంచి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వెళ్లేలా అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై అధికారులకు, మంత్రులకు ఎన్నోసార్లు వినతులను సమర్పించినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, సాధ్యం కాకపోతే మార్కెట్ రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ భూములో సర్వేను ఆపాలని రైతులు ఆందోళన చేశారు. రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా నాయకులు గొల్లపల్లి జయరాజు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.










ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్స్

కోహెడ/హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 8 : ఓపెన్ స్కూల్‌లో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారి కోసం 2024 సంవత్సరానికి గాను ఈనెల 8 నుంచి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమయ్యాయని కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కో ఆర్డినేటర్ మహమ్మద్ మహమూద్, హుస్నాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కోఆర్డినేటర్ వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ అడ్మిషన్ ప్రక్రియసెప్టెంబర్ 10 వతేది వరకు కొనసాగుతుందని స్పష్టంచేశారు. మరిన్ని వివరాలకు కోహెడ 9490769005, హుస్నాబాద్‌రూరల్ 9490297977 నంబర్‌ను సంప్రదించాలన్నారు.







మిషన్ కాకతీయ ఎయిర్ పైప్‌లైన్ నుంచి అక్రమంగా నీరు మళ్లింపు



ఎయిర్ పైపుకు బిగించిన మోటార్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8: సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందించడానికి మిషన్ కాకతీయ పేరిట పైపులను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా రంగనాయక సాగర్ నుంచి సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కెనాల్‌లోకి నీళ్లు రావడానికి పైప్‌లైన్ వేసి మధ్యలో ఎయిర్ పైపులను బిగించారు. అయితే గ్రామ సమీపంలోని కొంత మంది రైతులు ఎయిర్ పైపులపై ఉన్న కప్పులను తొలగించి నీళ్లను తమ పొలాల్లోకి మరల్చడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పైపులైన్‌పై కప్పును తొలగించి మోటార్లను బిగించి నీళ్లను పొలాలకి మలుపుతున్నట్లు కూడా ఆరోపిస్తున్నారు.

బియ్యం లారీ పట్టివేత

చేర్యాల, ఆగస్టు 8 : మండలంలోని ముస్త్యాల గ్రామ శివారులోని రైస్‌మిల్లు నుంచి బియ్యం లోడుతో వెళుతున్న లారీపై పలువురు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నంగునూరు మండలం రాంపూర్‌లోని శ్రీనిధి పారాబాయిల్డ్ ఇండస్ట్రీస్ వేబిల్ పేరిట మండలంలోని ముస్త్యాల శివారు రేణుకా పారాబాయిల్డ్ ఇండస్ట్రీస్ నుంచి ఖాజీపేట ఎఫ్‌సీఐకి బియ్యం తరలిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. వెంటనే రేణుకా ఇండస్ట్రీస్ వద్దకు చేరుకున్న పోలీసులు లారీని పట్టుకుని స్టేషన్‌కు తరలించి పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం అందించారు. వారి పరిశీలన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు









గొంతునులిమి వృద్ధురాలి హత్య


అంజమ్మ(ఫైల్)

టేక్మాల్, ఆగస్టు 8 : డబ్బు కోసం వృద్ధురాలిని గొంతు నొక్కి చంపిన సంఘటన మండలంలోని కాదులూరు శివారులో చోటుచేసుకున్నది. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాదులూర్ గ్రామ శివారు ఎల్లమ్మ గుడి సమీపంలోని దత్తాత్రేయ ఆశ్రమం వద్ద ఓబలి అంజమ్మ(70) జీవనం సాగిస్తుంది. వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇద్దరు కుమారులు మరణించగా కోడలు హైదరాబాద్‌లో జీవిస్తుంది. సాలోజిపల్లిలో ఉంటున్న పెద్ద కూతురు భర్త వేముల రాములు నిత్యం అత్తమ్మ అంజమ్మకు భోజనం తీసుకెళతాడు. రోజులాగే బుధవారం రాత్రి భోజనం తీసుకెళ్లే సరికి అంజమ్మ విగత జీవిగా పడి ఉన్నది. రాములు ఇంట్లో గమనించిగా ఓ మూలకు కాదులూరు గ్రామానికి చెందిన నదారి శివకుమార్ కూర్చొని ఉన్నారు. ఇక్కడ ఏం చేస్తున్నావు అని అడిగే సరికి రాములను కర్రతో కొట్టి పారిపోయాడు. వృద్ధురాలి మేడలో గుండ్లు తీసుకుని హత్య చేసినట్లు మెదక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. హత్యకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని అన్నారు. మృతురాలి అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

క్యూఆర్ కోడ్‌తో డబ్బు కాజేశారు

కల్హేర్, ఆగస్టు 8 : క్యూఆర్ కోడ్ పంపితే మీ అకౌంట్‌లో డబ్బు వేస్తామని చెప్పడంతో నమ్మిన వ్యక్తి వారు చెప్పినట్లే చేయగా తన అకౌంట్‌లో నుంచి డబ్బు పోగొట్టుకున్న సంఘటన సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హేమ్లానాయక్ తండాలో జరిగింది. సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి గురువారం వివరాలను వెల్లడించారు. హేమ్లానాయక్‌తండాకు చెందిన రాథోడ్ కిషన్‌నాయక్ బావమరిదికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. అంగన్‌వాడీ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నాం.. క్యూఆర్ కోడ్ పంపితే నీ భార్యకు రావల్సిన డెలివరీకి సంబంధించిన రూ.1200 పంపుతామని చెప్పారు. అతని వద్ద స్మార్ట్ ఫోన్‌లేకపోవడంతో బావ అయిన రాథోడ్ కిషన్‌నాయక్‌ను సంప్రదించాడు. వారు చెప్పినట్టు ఫోన్ ఆపరేట్ చేశారు. ఇక అంతే కిషన్‌నాయక్ అకౌంట్‌లో నుంచి రూ.43,570 కట్ అయినట్లు గుర్తించారు. వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయడంతో అకౌంట్‌లో మిగిలిన రూ.25,500 ఫ్రీజ్ అయ్యాయి. బాధితుడు కిషన్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడికి మాయమాటలు చెప్పి బంగారం చోరీ

● మూడు తులాలు అపహరించిన దుండగులు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 8 : వృద్ధుడికి మాయమాటలు చెప్పి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన సిద్దిపేటలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఇల్లెందుల యాదగిరి(70) అప్పడాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం యాదగిరి పట్టణంలోని సుభాష్‌రోడ్‌లో హోటల్లో టీ తాగి తన అప్పడాల దుకాణం వైపు వెళుతుండగా నలుగురు అతడిని అనుసరించారు. నలుగురిలో ఒకరు బండిపై వస్తుండగా ముత్యాల పోచమ్మ గుడి ఎదుట మిగిలిన ముగ్గురు అతడిని ఆపారు. బంగారం వేసుకొని తిరగవద్దు ముందు పోలీసులు పట్టుకుంటున్నారు జరిమానా విధిస్తున్నారని చెప్పి నాటకం ఆడారు. అతడికి ఒక పేపరు ఇచ్చి అందులో బంగారు ఆభరణాలు పెట్టి పంపించారు. ఆ తర్వాత ఈ ముగ్గురు వృద్ధుడి వద్దకు వచ్చి పెద్దాయన నువ్వు బంగారం వేసుకుని వెళ్లకు. పోలీసులు పట్టుకుంటారు అని నమ్మించారు. యాదగిరి చైను, ఉంగరం మొత్తం మూడు తులాల బంగారు ఆభరణాలు ఒక పేపర్లో చుట్టి, ఏమరిపించి ఆ దుండగుల వద్ద అప్పటికు ఉన్న గులకరాళ్ల పేపర్‌ను మార్చి ఇచ్చి పంపిచారు. యాదగిరి కొద్దిదూరం వెళ్లిన తర్వాత జేబులో నుంచి పేపర్ తీసి చూసేసరికి గులకరాళ్లు ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి వెంటనే టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సత్తా చాటాలి.. జాతీయస్థాయికి ఎదగాలి

● ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి
● నవోదయలో ముగిసిన క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ పోటీలు




నవోదయ అథ్లెటిక్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జావెలిన్ త్రోలో పాల్గొంటున్న విద్యార్థి

వర్గల్, ఆగస్టు 8 : నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటి జాతీయస్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఆకాంక్షించారు. గురువారం వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి నవోదయ విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమన్నారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. శరీర ఆరోగ్యాన్ని, మానసిక వికాసాన్ని కలిగించేవి క్రీడలేనన్నారు. దేశంలోని నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యుత్తమస్థాయికి ఎదగడానికి ఎంతో దోహదపడుతున్నయన్నారు. నవోదయ వంటి ప్రతిష్టాత్మక విద్యాలయంలో సీటు సాధించడం విద్యార్థుల అదృష్టమన్నారు. అనంతరం వేడుకలకు వచ్చిన ఎమ్మెల్సీతో పాటు పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిని ప్రిన్సిపాల్ రాజేందర్ సన్మానించారు. క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14, 17, 19 విభాగాల వారీగా 84 క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈ నెల 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూర్ జిల్లా నవోదయ విద్యాలయంలో నిర్వహించే రీజయన్ లెవల్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తొమ్మిది జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

వారంలో 135 సెల్‌ఫోన్ల రికవరీ

● సెల్‌ఫోన్ పోగుట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి
● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్
● పోలీసు కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా


రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లతో ఎస్పీ రూపేష్, ఏఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 8 : వారం వ్యవధిలో 135 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ వెల్లడించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మొబైల్ రికవరీ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజుల్లో మొబైల్ లేనిదే చిన్న లావాదేవీ కూడా చేయలేమని, విలువైన సమాచారం, బ్యాంకు అకౌంట్లు, పాస్‌వర్డ్ వంటివి మొబైల్‌ఫోన్లలో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన కొందరు సైబర్ నేరగాళ్లు వాటిని దొంగిలిస్తున్నారని తెలిపారు. అందులోని డాటాను ఉపయోగించి సోషల్ మీడియా ద్వారా వివిధ రకాల సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారాన్ని కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించడానికి సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి వచ్చిందని, దీని ద్వారా మంచి ఫలితాలు రాబడుతున్నామని వెల్లడించారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేసినట్లయితే షాప్ యజమాని నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తక్కువ ధరకు వస్తుందని మొబైల్‌లను కొనుగోలు చేసి మోసాలకు గురికావద్దని సూచించారు. దొంగిలించబడిన ఫోన్ అని తెలిసినా కొనుగోలు చేసినట్లయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జనవరి నుంచి జూలై వరకు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయబడిన 3,501 దరఖాస్తులలో 1604 ఫోన్లను గుర్తించి, 941 సెల్‌ఫోన్లను బాధితులకు అందించామని తెలిపారు. ఇందులో వారం రోజుల క్రితం ఏర్పాటు చేసిన స్పెషల్ టీం రికవరీ చేసిన 135 సెల్‌ఫోన్లను గురువారం బాధితులకు అందజేశామని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, అధికారులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

బొల్లారంలో పోలీస్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

జిన్నారం, ఆగస్టు 8 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పోలీస్‌స్టేషన్ నూతన భవనం కోసం కేటాయించిన స్థలాన్ని ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు గురువారం పరిశీలించారు. 248 సర్వే నంబరులోని మోడల్‌స్కూల్ సమీపంలో ఉన్న స్థలాన్ని సందర్శించారు. పట్టణానికి దూరంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌ను పట్టణ పరిధిలోకి మార్చాలని గతంలో స్థలాన్ని కేటాయించగా.. నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎస్పీ స్థల పరిశీలించారు. భవననిర్మాణం, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ గంగాధర్, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

ఆపమంటే.. ఢీ కొట్టాడు!

వాహన తనిఖీల్లో పోలీసుకు గాయాలు



అసలే పోలీసులు.. ఆపై వాహన తనిఖీలు.. పత్రాలు అడుగుతారు.. లేవంటే ఎంత జరిమానా వేస్తారో అన్న ఆందోళన.. ఆ టెన్షన్‌లో తన టీవీఎస్ మోటార్ సైకిల్‌ను వేగంగా పోనిచ్చాడు. తామంటే భయం లేదా..! ఆపకుండా వెళ్తావా..! అంటూ తనిఖీల్లో ఓ కానిస్టేబుల్ అడ్డు రాగా.. అతడిని ఢీ కొట్టాడు. దీంతో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మెదక్ జిల్లా రామాయంపేట - మెదక్ రహదారిపై జరిగింది.

- రామాయంపేట, ఆగస్టు 8

కాకతీయుల నాటి హనుమాన్ ఆలయంలో రాతి కలశం చోరీ

మద్దూరు, ఆగస్టు 8 : సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లలో కాకతీయుల కాలంలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి రాతి కలశాన్ని ఎత్తుకెళ్లారు. సుమారు క్వింటాలకుపైగా బరువు ఉన్న రాతి కలశం చోరీకి గురవ్వడం గ్రామంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలయంలో పనిచేస్తున్న తుమ్మలపల్లి బుచ్చమ్మ రోజూలాగే ఆలయాన్ని శుభ్రం చేసేందుకు గురువారం ఉదయం గుడికి వెళ్లాడు. ఆలయంలో వినాయకుని విగ్రహం ముందున్న రాతి కలశం కన్పించలేదు. చోరీకి గురైనట్లు భావించి మాజీ సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరికి సమాచారం అందించారు. ఆయన పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్‌ఐ జగదీశ్వర్, కానిస్టేబుల్ సిద్దార్థ ఆలయానికి చేరుకున్నారు. చోరీకి గురైన రాతి కలశానికి సంబంధించి వివరాలను గ్రామస్థులను అడిగి సేకరించారు. అతి పురాతనమైన ఆలయాన్ని ప్రభుత్వం దూపదీపనైవేద్యం కింద ఎంపిక చేసినప్పటికీ ఆలయ పూజారి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. గ్రామస్థులు నిత్యదీపరాధనకు ఒకరిని, ఆలయ శుభ్రతకు మరొకరిని నియమించారు. దొంగతనంపై విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపారు.


వివరాలను సేకరిస్తున్న పోలీసులు, చోరీకి గురైన రాతికలశం

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో చోరీకి యత్నం

● ఆలయ మండపం ఎడమవైపు ద్వారం వద్ద తాళం ధ్వంసం
● ముసుగు ధరించిన నలుగురి దుండగుల గుర్తింపు



తాళం పగులగొట్టి తెరిచేందుకు ప్రయత్నించిన తలుపు

వర్గల్, ఆగస్టు 8 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో అర్ధరాత్రి గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దొంగలు చోరీకి విఫల యత్నం చేశారు. సంఘటనకు సంబంధించి వివరాలు.. మండల కేంద్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు లైట్లు ఆఫ్ చేసి, సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. ఆలయం వెనుక వైపు నుంచి చొరబడిన దొంగలు ఆలయ మండపం ఎడమవైపు ద్వారం తాళాలు పగులగొట్టారు. ద్వారం తెరవడానికి ప్రయత్నిస్తుండగా ఆలయ సెక్యూరిటీ, కమిటీ సభ్యుల అలజడి వినిపించడంతో దొంగలు వారి కత్తిని వదిలేసి పారిపోయారు. ఆలయం వద్ద చోరీ యత్నం జరిగినట్లు గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు, ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు దొంగల ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలించారు. నలుగురు గుర్తుతెలియని దొంగలు ముఖానికి ముసుగు ధరించి చోరీ యత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వదిలి వెళ్లిన కత్తి

భక్తుల కల్పవల్లి 'కోటి పడగల నాగమ్మ'

● నేడు గాడిచర్లపల్లిలో నాగుల పంచమి జాతర


ఆలయంలో కొలువైన అమ్మవారు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8 : భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన సిద్దిపేటలోని గాడిచర్లపల్లి వద్ద కొలువై ఉన్న కోటి పడగల సంతాన నాగదేవత ఆలయంలో ప్రతీ ఏటా శ్రావణమాసం నాగుల పంచమి సందర్భంగా జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ వ్యవస్థాపకులు కంకణాల దశరథం స్వామి ఆధ్వర్యంలో జాతర కోసం ఏర్పాట్లు చేశారు. శుక్రవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు. జాతరకు జిల్లాతో పాటు హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి అలాగే మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలోని నాగదేవత ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

పర్యాటక సంస్థ ఫుడ్ కోర్టులు, రిసార్ట్స్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం..!

హైదరాబాద్, ఆగస్టు 8 : పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తూ ప్రభుత్వ ఖజానాకు ఏటా కోట్లాది నిధులను సమకూర్చుతున్న పర్యాటక సంస్థ రిసార్ట్స్, ఫుడ్ కోర్టులను ప్రైవేట్‌పరం చేయడానికి రంగం సిద్ధం చేసింది. మొదటగా గోల్కొండ ఇబ్రహీంబాగ్ సమీపంలోని తారామతి బరాదరి ఫుడ్‌కోర్టుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫ్ ప్రైవేట్ వ్యక్తుల హస్తగతం కానుంది. తర్వాత సిద్దిపేటలో కోట్లాది నిధులతో అభివృద్ధి చేసిన కోమటిచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద పర్యాటకుల కోసం అభివృద్ధి చేసిన లేజర్‌షో, లైట్‌అండ్ మ్యూజికల్ ఫౌంటేన్‌ల నిర్వహణ సంస్థకు ఆర్థిక భారంగా పరిణమించడంతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం నిరంతర కార్యక్రమం

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చిన్నశంకరంపేట, ఆగస్టు 8 : స్వచ్ఛదనం-పచ్చదనం నిరంతర కార్యక్రమమని, ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మండలంలోని గవ్వలపల్లి గ్రామంలో మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం పర్యటించారు. వీధులను పరిశీలించి, సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి పరిసరాలు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. సూరారం గ్రామంలో మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ నీలిమ, మండల ప్రతేకాధికారి వెంకటయ్య పాల్గొని పారిశుధ్య పనులను పరిశీలించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు నామ్‌పల్లి, ప్రవీణ్, టీఏలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


పాత రోలులో మట్టిని నింపుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలి

● మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్


వంటశాలను పరిశీలిస్తున్న రమేష్

కంది, ఆగస్టు 8 : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. కంది మండలం కాశీపూర్‌లోని కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయంలో గురువారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ క్రమశిక్షణతో మెలగాలని, న్యాయ పరిధిలో ఎలా జీవించాలో వివరించారు. గృహహింస, బాల్య వివాహం, వరకట్న నిషేధం, పోక్సో చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.

నాసిరకం రేషన్ బియ్యంపై ఫిర్యాదు

● స్పందించిన తహసీల్దార్


రేషన్ డీలర్లకు సరఫరా చేసిన నాసిరకం బియ్యం

అల్లాదుర్గం, ఆగస్టు 8 : మండలంలో నాసిరకం రేషన్ బియ్యం సరఫరాపై గురువారం స్థానికులు పౌరసరఫరాల జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం దుమ్ము, దూలి కలిగి ఉండటమే కాకుండా గడ్డల కట్టి ఉన్న బియ్యాన్ని మండలంలోని రేషన్ దుకాణాలకు సరఫరా చేసింది. రేషన్ వినియోగదారులు ఈ బియ్యం సరఫరాపై డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత బియ్యమే కదా అని ఇలాంటి నాణ్యతలేని బియ్యం సరఫరా చేస్తే ఎలా అంటు మండిపడ్డారు. చేసేదేమీలేక కొందరు రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లగా, మరికొందరు తిరస్కరించారు. నాసిరకం బియ్యం సరఫరాపై కార్డుదారులు జిల్లా అధికారులకు, స్థానిక తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు గురువారం ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ హుటాహుటిన రేషన్ డీలర్లతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. డీలర్లను అడిగి తెలుసుకొని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు తెలిపారు. దీంతో నాసిరకం రేషన్ బియ్యాన్ని తిరిగి గిడ్డంగులకు పంపంచి, నాణ్యమైన బియ్యాన్ని పొందాలని రేషన్ డీలర్లకు తహసీల్దార్ సూచించారు.

మెదక్‌లో 3కే మారథాన్

మెదక్ కల్చరల్, ఆగస్టు 8 : జాతీయ యూత్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(నాకో) ఆధ్వర్యంలో గురువారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 3కే మారథాన్ రన్ నిర్వహించారు. యువతను ప్రోత్సహించాలనే ఉదేశంతో 3కే రన్‌తో పాటు క్విజ్, రీల్ మేకింగ్, డ్రామా కాంపిటీషన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌ఆర్‌ఏసీ కౌన్సిలర్ కామని రాజేశ్వర్ మాట్లాడుతూ యువతలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించడం ఈ మారథాన్ రన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పెళ్లికి ముందు ప్రతీ ఒక్కరు హెచ్‌ఐవీ టెస్టు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో ఈ పరీక్షను ఉచితంగా నిర్వహిస్తామని, ఒకవేళ హెచ్‌ఐవీ సోకినట్టు అయితే వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. 3కే మారథాన్‌లో విజేతగా అర్జున్, రెండో స్థానంలో కేఎస్ మునీంద్ర, మూడో స్థానంలో ముఖేష్ నిలవగా వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ గోపి, ప్రవీణ్, శ్రీకాంత్. జిల్లా అథ్లెటిక్ సెక్రటరీ మధుసూదన్, అథ్లెటిక్ కోచ్ మౌలానా, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మారథాన్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్‌ఆర్‌ఏసీ కౌన్సిలర్ రాజేష్

దీక్షలు, పోరాటాల ఫలితమే మెడికల్ కాలేజీ

● టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
● మంత్రి దామోదర్‌తో కలిసి సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ సందర్శన

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8: సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎన్నో దీక్షలు, పోరాటాలు చేశామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు.



మెడికల్ కళాశాల విద్యార్థిని తేజస్వినితో మాట్లాడుతున్న మంత్రి దామోదర్, జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీని మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి జగ్గారెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో డిప్యూటీ సీఎంగా పనిచేసిన దామోదర్ రాజనర్సింహ సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూ ఏర్పాటు చేయించారని, మళ్లీ ఆయనకే ఆరోగ్యశాఖ మంత్రి పదవి రావడం అదృష్టమన్నారు. ఆయన సారథ్యంలో ఆస్పత్రి, మెడికల్ కళాశాలను అభివృద్ధి చేసుకుందామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడారు. మరో మూడునెలల్లో మెడికల్ కాలేజీ భవనాలను ప్రారంభిస్తామని తెలిపారు. ఇక్కడ అనుభవమున్న డాక్టర్లున్నారని, డయాలసిస్ బెడ్లు పెంచాలని, రోగులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని, ఆయూష్ ఓపీ సేవలు 15 రోజుల్లో ఇక్కడ ప్రారంభించాలని ఆదేశించారు. ఆయూష్ ఆస్పత్రి ఏర్పాటుకు కూడా ఏడాదిలో చర్యలు తీసుకుంటామని మంత్రి హామీఇచ్చారు. అనంతరం వైద్య విద్యార్థులు ఉదయ్, తేజస్వినితో మంత్రి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మైదానం, ఆడిటోరియం కావాలని వైద్య విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జీజీహెచ్ ప్రాంగణంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను మంత్రి సందర్శించగా హబ్‌లో టెక్నీషియన్లు లేరని అక్కడి విభాగాధిపతి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డిప్యూటేషన్‌పై సిబ్బందిని నియమిస్తామని డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ మంత్రికి చెప్పగా.. డిప్యూటేషన్ల మాట వినపడొద్దని, అవసరమైతే కమిషనర్‌కు లేఖరాసి ఎన్‌హెచ్‌ఎం ద్వారా టెక్నీషియన్లను భర్తీ చేసుకోవాలని మంత్రి దామోదర్ డీఎంహెచ్‌వోకు సూచించారు.



కళాశాలలోని మహాత్ముడి విగ్రహానికి పూలమాలవేసిన మంత్రి రాజనర్సింహ, జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

● పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ

మెదక్ అర్బన్, ఆగస్టు 8: ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు పక్షోత్సవాల్లో భాగంగా గురువారం సభ్యత్వ నమోదు నిర్వహించి మాట్లాడారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంఘం పక్షాన అనేక రకాల ప్రాతినిథ్యం చేయడంతో కొన్ని జీవోలను సాధించుకున్నామన్నారు. గత పీఆర్సీలో రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఫిట్‌మెంట్ వర్తించే విధంగా కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, చంద్రశేఖర్, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు జీడిమెట్ల డిపో బస్సులు: డీఎం

గుమ్మడిదల, ఆగస్టు 8: వివాహ శుభకార్యాలకు, విహార యాత్రలకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెట్టిన జీడిమెట్ల డిపో నుంచి అతి తక్కువ ధరకే ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. గురువారం గుమ్మడిదలలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెలలో పెళ్లిళ్లు, శుభకార్యాలు అధికంగా ఉన్నందున అద్దెకు ఆర్డినరీ, మెట్రో బస్సులు డిపాజిట్ లేకుండా ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి వచ్చేనెల 10వ తేదీవరకు శ్రావణమాసం సందర్భంగా పెళ్లిళ్ల కోసం జీడిమెట్ల డిపో బస్సులు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. వివరాలకు 7382822588, 8333963572 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమాచారం

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కొండాపూర్: పుట్టినబిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని సీడీపీవో చంద్రకళ తెలిపారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీలో పలువురికి అన్నప్రాసన చేశారు.

కాళ్లకల్‌లో ఏపీజీవీబీ మైక్రో సేవలు

మనోహరాబాద్: కాళ్లకల్ గ్రామంలో ఏపీజీవీబీ బ్యాంక్ ద్వారా మైక్రో ఏటీఎం సేవలను మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్‌ముదిరాజ్ గురువారం ప్రారంభించారు. గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా వృద్ధులు బ్యాంక్ వరకు వెళ్లకుండానే మైక్రో ఏటీఎం ద్వారా పెన్షన్ డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చని అన్నారు. ఏపీజీవీబీ సిద్దిపేట్ ఐరిక్స్ ఇన్‌చార్జి శంకర్, బ్యాంక్ చానల్ మేనేజర్ రాజు, బ్యాంక్ మిత్ర సత్యనారాయణగౌడ్, అజయ్ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయ పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్

జహీరాబాద్, ఆగస్టు 8: జహీరాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరాలయం నూతన (పాలకవర్గం) కమిటీ ఏర్పాటుకు గురువారం నోటిఫికేషన్ విడుదలైందని ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేశారన్నారు. ఆసక్తిగల వారు 28 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రామంతపూర్‌లో జ్వర సర్వే

మాసాయిపేట: మాసాయిపేట మండలం రామంతపూర్‌తండాల్లో వైద్యాధికారులు జ్వర సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రమీల, నవీన ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న గ్రామస్థులు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

టేక్మాల్: టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవినీతి జరిగిందని టేక్మాల్ సొసైటీకి చెందిన డైరెక్టర్లు మెదక్ జిల్లా డీసీవోకు గురువారం ఫిర్యాదు చేశారు. సొసైటీకి సంబంధించిన రూ.30 లక్షల వరకు అవినీతి జరిగిందని తెలిపారు. నిధులను దుర్వినియోగం చేసిన చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సీఈవో వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విరాళాల సేకరణ

నారాయణఖేడ్: కేరళలోని వయనాడ్ బాధితుల కోసం గురువారం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, ఖేడ్ డివిజన్ బాధ్యులు రమేష్, సంతోష్, అరుణ్, శ్రీనివాస్, మహిపాల్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపారుల వద్దకెళ్లి విరాళాలు సేకరించారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

నారాయణఖేడ్: మండల పరిధిలోని తుర్కపల్లికి చెందిన గోవింద్ నర్సింలు తండ్రి కిష్టయ్య వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.36 వేలను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం: అదనపు కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్టేడియం ప్రాంగణంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మొక్క నాటి, వెయ్యిమంది విద్యార్థినులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో ఖాసీంబేగ్, యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూనవేణు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

●**కంది:** మండల కేంద్రమైన కంది పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగవ రోజు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు, కళాశాల సిబ్బంది నిర్వహించారు. కళాశాల ఆవరణ మొత్తం శుభ్రం చేయించి, వివిధరకాల మొక్కలు నాటారు.

●**పటాన్‌చెరు:** జీహెచ్‌ఎంసీ పటాన్‌చెరు డివిజన్‌లో గురువారం పలు కాలనీల్లో డిప్యూటీ కమిషనర్ సురేష్, సిబ్బందితో కలిసి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ స్వచ్ఛదనం-పచ్చదనం ప్రారంభించారు.

●**కల్హేర్:** సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్(నల్లవాగు)లో గురువారం స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సాంఘీక సంక్షేమశాఖ గురుకుల, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో మొక్కలు నాటారు.

●**జిన్నారం:** కొడకంచి పరిధి పుట్టుగూడ ప్రాథమిక పాఠశాలను మండల తహసీల్దార్ భిక్షపతి సందర్శించి, మొక్కలు నాటారు.

●**కంగ్టి:** స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా కంగ్టి, నాగూర్, బీంరా, తుర్కవడగాం గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్య పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు.

●**పుల్‌కల్:** మండల కేంద్రం పుల్కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది గురువారం మొక్కలు నాటారు.

●**మునిపల్లి:** మండల పరిధిలోని బుసారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాలను ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు సందర్శించి, పారిశుధ్య పనులు, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. మల్లారెడ్డిపేటలో పల్లె ప్రకృతివనం వద్ద పిచ్చగడ్డి ఉండడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీహర్షపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెదక్ జిల్లాలో

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 8: ప్లాస్టిక్ వాడితే జరిగే అనర్థాలను ప్రజలకు తెలియజేయాలని మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు సూచించారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా పట్టణంలోని 9, 1వ వార్డులో మున్సిపల్ అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. చైతన్య, గీత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

●**నర్సాపూర్:** స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మండలంలోని కాగజ్‌మద్దూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. నర్సాపూర్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

●**తూప్రాన్:** తూప్రాన్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పరిధి అల్లాపూర్ హైస్కూల్‌లో సీజనల్ వ్యాధులు, కుక్కల దాడుల నుంచి రక్షణ, బాల్య వివాహాల గురించి విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్ జిన్న భగవాన్‌రెడ్డితో కలిసి పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. ఇందులో కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో మొక్కను నాటుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కారదర్శి రాజు ప్రతీ ఇంటికి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

●**చేగుంట:** చేగుంట మండలంలోని చేగుంట, ఇబ్రహీంపూర్, రుక్మాపూర్‌లోమండల ప్రత్యేకాధికారి బ్రహ్మాజీ పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు.

●**నిజాంపేట:** మండల పరిధిలోని నగరం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవో రాజిరెడ్డి సందర్శించి, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని క్రీడా ప్రాంగణం వద్ద డీఎల్పీవో సురేష్‌బాబు మొక్కలు నాటారు.



ఖేడ్‌లో కేక్‌కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి



కల్హేర్: మాసాన్‌పల్లి చౌరస్తాలో షెట్కార్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా ఎంపీ సురేష్‌షెట్కార్ జన్మదిన వేడుకలు

నారాయణఖేడ్/కల్హేర్/కంగ్టి/జహీరాబాద్/పెద్దశంకరంపేట, ఆగస్టు 8: జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ 64వ జన్మదిన వేడుకలను గురువారం నారాయణఖేడ్‌లోని ఆయన స్వగృహంలో అభిమానులు, కార్యకర్తలు, అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామీల ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి ఢిల్లీలో ఉన్న ఎంపీకి ఫోన్‌ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహేర్‌అలీ, సుభాష్‌పాటిల్, మాణిక్‌రావు, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్, సద్దాం, హన్మాండ్లు ఉన్నారు. కాగా మండల పరిధిలోని నిజాంపేటలోను సురేష్‌షెట్కార్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో ఎంపీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఇందులో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రాలైన కల్హేర్, సిర్గాపూర్‌లతో పాటు కల్హేర్ మండల పరిధిలోని మాసాన్‌పల్లి చౌరస్తాలో కేక్ కట్‌చేసి ఎంపీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కల్హేర్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ కల్హేర్, సిర్గాపూర్ మండలాల అధ్యక్షులు పోచయ్య, మనీష్‌పాటిల్, మాజీ సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన కంగ్టిలోని సుభాష్‌చంద్రబోస్ చౌక్ వద్ద కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, మాజీ చైర్మన్ మనోజ్‌పాటిల్, ప్రకాష్‌రాథోడ్, చందర్‌రెడ్డి పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాంలింగారెడ్డి, హన్మంతరావుపాటిల్, పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయం వద్ద ఎంపీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పేటలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి: విష్ణు

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్/జహీరాబాద్, ఆగస్టు 8: న్యాయవాదులపై దాడులు అరికట్టేందుకు న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే తేవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనగామలో న్యాయవాదులు అమృతరావు, కవితలపై జరిగిన దాడిని ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులంతా గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అంబరీష్, ఆంజనేయులు, విజయకుమార్, లలిత పాల్గొన్నారు. న్యాయవాద దంపతులు అమృతరావు, కవితపై పోలీసుల దాడిని నిరసిస్తూ మెదక్ కోర్టులో రెండోరోజు న్యాయవాదులు విధులకు దూరంగా ఉన్నారు. జనగాం పోలీసులపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. జహీరాబాద్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గోపాల్, బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



సంగారెడ్డి క్రైం: విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల పోరుబాట

హత్నూర/చేగుంట/పెద్దశంకరంపేట/శివ్వంపేట/మునిపల్లి, ఆగస్టు 8: గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ హత్నూర మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా తాము చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నా, సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా పారిశుధ్య కార్మికులకు వేతనాల పెంపుతో పాటు ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జీవో నెంబరు 60ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని చేగుంట మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెకు దిగారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీకాంత్, బాగ్య, బాల్‌రాజు, నర్సమ్మ పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలో గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పేట పంచాయతీ కార్మికులు పి.రాములు, వివేక్, భూమయ్య చాకలి రాములు, మానయ్య, లచ్చమ్మ, సాయమ్మ, సుశీల సమ్మె చేపట్టారు. శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు. ఈ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన మునిపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దశరథ్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు.



హత్నూర ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన మాణిక్‌రావు

జహీరాబాద్, ఆగస్టు 8: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు రూ.8 లక్షలు విలువచేసే చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రజారోగ్యం నిమిత్తం అందజేసిన చెక్కులను వైద్య ఖర్చుల నిమిత్తం వాడుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నామకిరణ్, బండిమోహన్, యాకూబ్, తులసీదాస్‌గుప్తా, గణేష్, చంద్రయ్య, పద్మజ, దేవదాస్ పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి: పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ/మెదక్ కల్చరల్, ఆగస్టు 8: ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన పద్మారెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు గురువారం స్వాగతం పలికారు. జిల్లా పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆమెను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ సన్మానించారు. అనంతరం మెదక్ జిల్లా కేంద్రంలోని మాతా ఘట్టమ్మ దేవతా స్థిర విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, నాయకులు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, ఆర్కె శ్రీనివాస్, జయరాజ్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనది'

జహీరాబాద్, ఆగస్టు 8: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాబేర్‌అలీ పేర్కొన్నారు. పట్టణంలోని పుగట్‌నగర్‌లో గల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎ.హఫీజ్ పదవీ విరమణ కార్యక్రమాన్ని గురువారం పాఠశాలలో ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. దశాబ్దాలకాలంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం స్పందించి ఇటీవల బదిలీలు, పదోన్నతులు చేపట్టిందన్నారు. పాఠశాలఅభివృద్ధికి హఫీజ్ చేసిన కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, రమేస్‌కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ రమాదేవిని సన్మానిస్తున్న మాజీ ఎంపీటీసీ పండరినాథ్, తదితరులు

నాగల్‌గిద్ద, ఆగస్టు 8: నాగల్‌గిద్ద మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమాదేవిని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో దామర్‌గిద్ద తాజా మాజీ ఎంపీటీసీ శేరికార్ పండరినాథ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హన్మంత్‌రెడ్డి, తాజొద్దీన్, కాంగ్రెస్ నాయకులు కుశల్‌రెడ్డి, మల్లికార్జున్, గణపతిపాటిల్, తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి

మెదక్ అర్బన్, ఆగస్టు 8: మెదక్ జిల్లా కేంద్రంలోని దుర్గా కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాత్విక్(11) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. గతనెల జూలై 28న దుర్గా కాలనీలో మురుగు కాలువ శుభ్రపరిచేందుకు వెళ్లిన మున్సిపల్ కార్మికుడు మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల మైసయ్యను మంబోజిపల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు సడన్ బ్రేక్ వేడయంతో అదుపు తప్పి పల్టీకొట్టి ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న సాత్విక్‌ను కూడా ఢీకొట్టింది. తీవ్రగాయాలైన బాలుడిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. 12 రోజులు పాటు మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అదుపు తప్పి డీసీఎం బోల్తా

చేగుంట, ఆగస్టు 8: అదుపుతప్పి డీసీఎం బోల్తాపడిన సంఘటన నార్సింగి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారి వద్ద గురువారం చోటు చేసుకున్నది. హైదరాబాద్‌లోని గాగిల్లాపూర్ నుంచి నిజామాబాద్‌కు ఇంటీరియల్ డెకరేషన్ సామాను లోడుతో వెళ్తున్న డీసీఎం నార్సింగి శివారులో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతుల పట్ల పక్షపాతం



రైతులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేస్తున్న ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 8: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వివిధ ప్రాజెక్టులకు భూములు కోల్పోయిన రైతుల పట్ల వివక్ష పూరితంగా పరిహారం ఇప్పించారని, నేడు కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రాంతాల రైతులకు నష్టం కలుగకుండా సమన్యాయం చేస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి పేర్కొన్నారు. 26 రోజులుగా సంగారెడ్డి కెనాల్‌లో భూములు కోల్పోయే రైతులు చేస్తున్న రిలే దీక్షా శిబిరం వద్దకు గురువారం చేరుకుని, రైతులతో మాట్లాడి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరంలో భూములు కోల్పోయిన రైతులలో సిద్దిపేట ప్రాంత రైతులకు ఎక్కువ పరిహారం ఇప్పించి, నర్సాపూర్ ప్రాంత రైతులకు చాలా తక్కువ పరిహారం ఇప్పించి అన్యాయం చేశారని అన్నారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్ పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే గీత కార్మికులకు హక్కులు

● కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్

జహీరాబాద్, ఆగస్టు 8: సమాజంలో నేడు గీత కార్మికుల పొందుతున్న హక్కులన్నీ అమరుల పోరాట ఫలితమేనని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. అమరుల యాదిలో భాగంగా గురువారం పట్టణంలోని శ్రీనివాస్ ఫంక్షన్‌హాల్‌లో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గీతన్న చైతన్యయాత్ర పేరుతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నీరా ప్రాజెక్ట్ టెండర్‌ను రద్దు చేయాలన్నారు. అమరుల స్ఫూర్తితో హక్కుల సాధనకు సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మురళీక్రిష్ణగౌడ్, ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హనుమాగౌడ్, విఠల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్విట్ కార్పొరేట్ ఉద్యమం

● కార్మిక సంఘాల నేతల పిలుపు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 8: క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని 9న నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాజేందర్‌రెడ్డి, సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ అనుకూల బీజేపీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మికవర్గం క్విట్ కార్పొరేట్ అనే నినాదంతో వాడవాడలా నిరసనలు తెలపాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. 14న రాత్రి కార్మికుల జన జాగరణ ఆట పాట కార్యక్రమాలతో కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఉచిత బస్‌పాసులు

నారాయణఖేడ్, ఆగస్టు 8: మనూరు మండలం డోవురుకు చెందిన న్యాయవాది సంగన్న, ఆయన సోదరుడు శివకుమార్, రాజు, వెంకట్ తమ తండ్రి జర్పు గొండ స్మారకార్థం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 500 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను అందించేందుకు అవసరమైన రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు డీఎం మల్లేశయ్య 500 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ దారం శంకర్, ఉపాధ్యాయులు, మార్కెటింగ్ సేల్ ఇన్‌చార్జి పాండు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నారాయణఖేడ్, ఆగస్టు 8: నారాయణఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ఈసీఈ, ట్రిపుల్ ఈ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో భర్తీ కోసం 11 వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలి ఉన్న ఖాళీసీట్ల వివరాలను కళాశాల నోటీసు బోర్డులో ఉంచామని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 12న ఉదయం 10 నుంచి తక్షణ భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ప్రాసెసింగ్ ఫీజు రూ.7 వేలు చెల్లించాలని, ఫీజు చెల్లించని వారి సీటును రద్దు చేసి, వేరే అభ్యర్థికి కేటాయిస్తామన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో నేరుగా లేదా, 8143504002లో లేదా టీఎస్ పాలిసెట్ వెబ్‌సైట్‌లోను చూడవచ్చన్నారు.

ప్రైవేటుకు దీటుగా బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు: పీజీఎం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 8: ప్రైవేటు టెలికమ్ నెట్‌వర్క్‌లకు దీటుగా బీఎస్‌ఎన్‌ఎల్ సేవలందిస్తున్నామని ఆ సంస్థ పీజీఎం, మెదక్ జిల్లా ఇన్‌చార్జి డి.రాజరాజేశ్వరి తెలిపారు. సంగారెడ్డిలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో నుంచి ఐబీ, కొత్త బస్టాండ్ మీదుగా ప్రభుత్వ ఐటీఐ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ సేవలను మరింత విస్తరించేందుకు ర్యాలీ ద్వారా ప్రజలకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శివరాం ప్రసాద్, ఏజీఎంలు నాగేశ్వరరావు, బాలాజీ, జగన్, లక్ష్మణ్, మాలకొండయ్య పాల్గొన్నారు.

నేడు ఇస్లాంపూర్‌కు మంత్రి కొండా సురేఖ

తూప్రాన్, ఆగస్టు 8: తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో నేడు చివరిరోజు నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనంలో పాల్గొనడానికి రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ విచ్చేస్తున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సీహెచ్ ఎల్లయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శేషాద్రితో కలిసి విలేకరులతో మాట్లాడారు.